క్లుప్తంగా

ప్రశాంతంగా నీటి సంఘాల ఎన్నికలు

నాగులుప్పలపాడు: మండలంలో నీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిసాయి. అన్నిప్రాదేశిక నియోజక వర్గాల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. తిమ్మసముద్రం 1 సెగ్మెంట్ 12 ప్రాదేశికాలు, తిమ్మసముద్రం 2కు 12 ప్రాదేశికాలు, అమ్మనబ్రోలు 6 ప్రాదేశికాలు కలిపి మొత్తం 30 ప్రాదేశికాలకుగానూ ఒక్కొక్క నామినేషన్ రావడంతో వారంతా ఏకగ్రీవంగా గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. వారికి నియామకపత్రాలు అందజేశారు. ఎన్నికల అధికారులుగా తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ వై.మహాలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ వాసుదేవరావు వ్యవహరించగా, సచివాలయ సిబ్బంది పీఓ, ఏపీఓలుగా విధులు నిర్వర్తించారు. ఆర్‌ఐ రమేష్, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ఎస్‌ఐ శ్రీకాంత్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

చీమకుర్తి మండలంలో...

చీమకుర్తి రూరల్: మండలంలోని మైనర్, మేజర్ నీటి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. మైనర్ నీటి సంఘాలైన చీమకుర్తి, గోనుగుంట, బూసపల్లి, పులికొండ, చంద్రపాడు నీటి సంఘాలకు అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. అదేవిధంగా మేజర్ నీటి సంఘాలైన చీమకుర్తి, మంచికలపాడు, గోనుగుంట–1 గోనుగుంట–2, పిడతలపూడి, పులికొండ, మైలవరం, బండ్లమూడి, పల్లామల్లి, చంద్రపాడు, దేనువకొండ, నేలటూరు నీటి సంఘాలకు అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు.

మద్దిపాడు మండలంలో...

మద్దిపాడు: మండలంలో నాలుగు నీటి సంఘాలకు శనివారం ఎన్నికలు ముగిశాయి. లింగంగుంట, దొడ్డవరం, నేలటూరు, ధేనువకొండ–1 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించగా, వైఎస్సార్ సీపీ బహిష్కరించడంతో టీడీపీకి చెందిన వారు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

సంతనూతలపాడు మండలంలో...

సంతనూతలపాడు: మండలంలో మైనర్, మేజర్ నీటి సంఘాలకు ఎన్నికలు పూర్తయ్యాయి. వైఎస్సార్ సీపీ బహిష్కరించడంతో మైనర్, మేజర్ నీటి సంఘాలకు టీడీపీ సానుభూతిపరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: మండలంలో శనివారం జరిగిన నీటి సంఘాల ఎన్నికలను వైఎస్సార్ సీపీ బహిష్కరించింది. తహసీల్దార్ మధుసూదన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలకు ఎస్సై సుధాకర్‌బాబు బందోబస్తు నిర్వహించారు. టీడీపీ సానుభూతిపరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

భార్యతో గొడవ పడి ఆత్మహత్యాయత్నం

ఒంగోలు టౌన్: భార్య, భర్తల మధ్య వచ్చిన ఒక చిన్న గొడవతో మనస్థాపానికి గురైన ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. పోలీసుల కథనం మేరకు నగరంలోని సత్యనారాయణపురానికి చెందిన ఒక వ్యక్తికి డబ్బుల విషయంలో భార్యతో చిన్న పేచీ వచ్చింది. దాంతో ఇద్దరి మధ్య వివాదం చోటు చేసుకుంది. భార్య తన మాట వినడం లేదని మనస్థాపానికి గురైన అతడు శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకునేందుకు సంతపేట రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నాడు. అప్రమత్తం అయిన అతడి భార్య 100 కు కాల్ చేసి పోలీసులకు విషయం చెప్పింది. వెంటనే రెండో పట్టణ సీఐ మేడా శ్రీనివాసరావు, తన సిబ్బందిని అప్రమత్తం చేశారు. రెండో పట్టణ మహిళా హెడ్ కానిస్టేబుల్ హెప్సీ రాణి, రక్షక్ డ్రైవర్ హోంగార్డ్ శ్రీనివాసరెడ్డిలను రైల్వే స్టేషన్ వద్దకు పంపించారు. సంతపేట రైల్వే ట్రాక్ వద్ద ఆ వ్యక్తిని గుర్తించి, అతనికి నచ్చజెప్పి, టూ టౌన్ పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. భార్యను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

నేడు దత్త కళ్యాణ మహోత్సవం

బేస్తవారిపేట: దత్త జయంతి సందర్భంగా స్థానిక నెహ్రూబజార్‌లోని సాయి నిలయంలో ఆదివారం కళ్యాణం నిర్వహిస్తున్నట్లు దత్త సాయి భరద్వాజ్ భక్త బృంద సభ్యులు తెలిపారు. ఉదయం బాబాకు కాకడ హారతి, పంచామృత అభిషేకాలు, గురు చరిత్ర పారాయణం, అనఘాలక్ష్మి సమేత దత్తాత్రేయ స్వామి కళ్యాణం, మధ్యాహ్నం అన్న సంతర్పణ చేయనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఈ బాదుడేంది బాబూ..!

- నబ్సిడీ శనగలకు బయట మార్కెట్ కంటే ఎక్కువ చెల్లించాలంటున్న వ్యవసాయ శాఖాధికారులు
- మాకొద్దు బాబోయ్ అంటూ బయట మార్కెట్లకు వెళ్తున్న రైతులు
- ఇదేం ప్రభుత్వమంటూ కూటమి పాలకుల తీరుపై అన్నదాతల విమర్శలు



కొత్తపట్నం: ఎన్నికల సమయంలో రైతు సంక్షేమమంటూ కల్లబొల్లి మాటలు చెప్పడం.. వారికి అలవిమాలిన హామీలివ్వడం.. నమ్మకంగా ఓట్లేయించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను గాలికొదిలేసి నిలువునా మోసం చేయడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఎప్పటిలాగే ఈసారి కూడా అదే చేశారాయన. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు ఏటా పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో ప్రచారం చేశారు. రైతులకు అవసరమైనవన్నీ చేస్తామన్నారు. కానీ, కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా రైతు సంక్షేమం అనే మాటే లేకుండా పోయింది. పెట్టుబడి సాయంగా ఇస్తామన్న రూ.20 వేలు ఇవ్వకపోగా, గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే చెల్లించిన పంటల బీమా ప్రీమియంను కూడా ప్రస్తుతం రైతులతోనే కట్టిస్తూ వారిపై భారం మోపారు. అన్నదాతల సమస్యలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రస్తుతం ఏకంగా సబ్సిడీ శనగ విత్తనాల పేరుతో బయట మార్కెట్ కంటే అదనంగా రైతుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారు. దీంతో సబ్సిడీ శనగ విత్తనాలు మాకొద్దు బాబూ అంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులను ఆదుకుంటామని చెప్పిన కూటమి ప్రభుత్వం.. నమ్మించి ఓట్లు వేయించుకుని ఇప్పుడు నట్టేట ముంచిందంటూ ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయానికి సహాయ సహకారాలు అందించకపోగా రైతులపై భారం మోపుతోందని మండిపడుతున్నారు.

క్వింటాకు రూ.500 అదనపు వసూళ్లు...

కూటమి ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న శనగ విత్తనాల కోసం బయట మార్కెట్ కంటే క్వింటాకు రూ.500 అదనంగా చెల్లించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. అలాంటప్పుడు ప్రభుత్వం నుంచి శనగ విత్తనాలు కొనాల్సిన అవసరం ఏముందంటూ బయట మార్కెట్‌కు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. ఇదేనా మంచి ప్రభుత్వం అంటూ రైతులు విమర్శిస్తున్నారు. కొత్తపట్నం మండలంలోని ఆలూరు, గాదెపాలెం, అల్లూరు, చింతల, ఈతముక్కల, రాజుపాలెం, సంకువారిగుంట, మడనూరు గ్రామాల్లో సుమారు 4 వేల ఎకరాల్లో ఎర్ర శనగలు, తెల్ల శనగలు సాగు చేస్తున్నారు. డిసెంబర్ నుంచి మార్చిలోపు మెట్ట భూముల్లో శనగ పండిస్తారు. మంచుపై ఆధారపడి సాగు చేస్తారు. ఈ ఏడాది వర్షాలు ఎక్కువైనందున భూమిలో తేమ శాతం ఉందని రైతులు కొంచెం ఆలస్యంగా శనగ వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సబ్సిడీపై అందించే శనగ విత్తనాల ధరలు చూసి రైతులు అవాక్కయ్యారు. ఎర్ర శనగలు క్వింటా రూ.9,400 కాగా, 25 శాతం సబ్సిడీపోను 7,050 రూపాయలను రైతులు చెల్లించాల్సి వస్తోంది. తెల్ల శనగలు క్వింటా ధర రూ.12,100 కాగా, 25 శాతం సబ్సిడీపోను 9,075 రూపాయలను రైతులు చెల్లించాలి. కానీ, బయట మార్కెట్లో ఎర్ర శనగలు క్వింటా రూ.6,500కి, తెల్ల శనగలు రూ.8,500కి రైతులకు లభిస్తున్నాయి. క్వింటాకు బయట మార్కెట్ కంటే రూ.500 అదనంగా ప్రభుత్వం వసూలు చేస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్వింటాకు సబ్సిడీపోను బయట మార్కెట్ కంటే రూ.1,500 నుంచి రూ.2 వేల వరకూ తక్కువకే శనగ విత్తనాలు వచ్చేవని రైతులు చెబుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం బయట మార్కెట్ కంటే అదనంగా రూ.500 భారం మోపుతోందని దుయ్యబడుతున్నారు. చేసేది లేక బయట మార్కెట్‌కు వెళ్లి శనగలు తెచ్చుకుంటున్నారు. ఇదేనా మంచి ప్రభుత్వం చంద్రబాబూ అంటూ రైతులు విమర్శిస్తున్నారు. పాలకులు, అధికారులు వెంటనే స్పందించి బయట మార్కెట్ కంటే తక్కువ ధరకు రైతులకు శనగ విత్తనాలు ఇవ్వాలని కోరుతున్నారు.

> **బయట మార్కెట్ కంటే తక్కువ ధరకు ఇస్తేనే సబ్సిడీకి ఇచ్చినట్లు**
>
> 
>
> కూటమి ప్రభుత్వం రైతులను పిచ్చోళ్లను చేస్తోంది. బయట మార్కెట్ కంటే తక్కువకు శనగ విత్తనాలు ఇవ్వకుండా అదనంగా రైతుల దగ్గర వసూలు చేస్తోంది. పైగా, సబ్సిడీ అంటూ మోసం చేయడం మంచి పద్ధతి కాదు. నేను 5 ఎకరాల్లో ప్రతి సంవత్సరం శనగ పంట సాగుచేస్తా. ప్రభుత్వం ద్వారానే విత్తనాలు తీసుకుంటా. ఎప్పుడూ సబ్సిడీ విత్తనాలను బయట మార్కెట్ కంటే ఎక్కువ ధరకు ఇవ్వడం చూడలేదు. ఏటా తక్కువ ధరకే ఇచ్చేవారు. కానీ, కూటమి ప్రభుత్వం బయట మార్కెట్ కంటే ఎక్కువ వసూలు చేస్తూ రైతులను మోసం చేస్తోంది.
>
> – చాగంటి సుధాకర్‌రెడ్డి, రైతు ఆలూరు

నేడు ఉచిత వైద్య శిబిరం

చీమకుర్తి రూరల్: మండలంలోని మర్రిచెట్లపాలెం గ్రామంలో ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఒంగోలు వారితో పాటు శ్రీ కార్తికేయ పాలి క్లినిక్ ఆధ్వర్యంలో ఒంగోలు లయన్స్ క్లబ్ సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శ్రీ కార్తికేయ పాలి క్లినిక్ డాక్టర్ శివకృష్ణ తెలిపారు. ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మర్రిచెట్లపాలెంలోని శ్రీ కార్తికేయ పాలి క్లినిక్ హాస్పిటల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో పలువురు వైద్య నిపుణులు పాల్గొని సేవలందిస్తారని తెలిపారు. సుగరు, బీపీ, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేస్తారని, మందులు కూడా ఉచితంగా ఇస్తారని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


భవన నిర్మాణ కార్మికుల సంఘ అధ్యక్షుడి ఎన్నిక



బండారు శేషగిరి

ఒంగోలు వన్‌టౌన్: జనశక్తి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘ నగర అధ్యక్షునిగా ఒంగోలుకు చెందిన బండారు శేషగిరి ఎన్నికయ్యారు. ఒంగోలు విజయనగర్ కాలనీలోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు తమ్మిశెట్టి యానాది అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. నగర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శేషగిరి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్తాత్రేయస్వామి జయంతి



ప్రగతినగర్‌లో ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయస్వామి



పూజలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో:

మార్గశిర మాసం శనివారం పౌర్ణమి దత్త జయంతి సందర్భంగా నగరంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సంతపేట సాయిబాబా మందిరంలో, హౌసింగ్ బోర్డులోని సాయిబాబా మందిరంలో, కర్నూల్ రోడ్డులోని షిరిడీ సాయిబాబా మందిరంలో, ఒంగోలు మంగమూరు రోడ్డు ఆశ్రమం దగ్గర సాయిబాబా మందిరంలో, పేర్నమిట్ట సాయిబాబా మందిరంలో, త్రోవగుంట షిరిడీ సాయిబాబా మందిరంలో, పెళ్లూరు సాయిబాబా మందిరంలో, కొప్పోలు షిరిడీ సాయిబాబా మందిరంలో దత్త జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. సంతపేట సాయిబాబా మందిర ప్రాంగణంలో ఉదయం దత్తాత్రేయస్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. పది గంటలకు ఆలయ అర్చకులు దత్త హోమం నిర్వహించారు. సాయి యువసేన, సాయి మహిళా ఆధ్వర్యంలో భజన దత్త పారాయణం భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటలకు సిద్ధ మంగళస్తోత్రం పారాయణం, భక్తులు సామూహికంగా జప పారాయణం చేశారు. మధ్యాహ్నం దేవస్థాన కమిటీ చైర్మన్ అళహరి చెంచలరావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. సాయి యువసేన, సాయి మహిళా సభ్యులు, దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి పొటాష్ ద్రావణంతో పైరుకు ఆరోగ్యం



ప్రకృతి పొటాష్ ద్రావణాన్ని తయారు చేస్తున్న వెంకటేశ్వరరెడ్డి

కొత్తపట్నం: పైరుకు పొటాష్ లోపించినప్పుడు దాని నివారణకు ప్రకృతి పద్ధతిలో తయారు చేసిన పొటాష్ ద్రావణాన్ని పిచికారీ చేస్తే ఎక్కువ దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి పిట్టు వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని మడనూరు గ్రామంలో శనివారం రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో ప్రకృతి పద్ధతిలో పొటాష్ ద్రావణాన్ని తయారు చేసే పద్ధతి గురించి వివరించారు. పొటాష్ తయారు చేయడానికి అరటి బోదెలు తీసుకుని వాటిని చిన్నచిన్న ముక్కలుగా కోసి డ్రమ్ములో వేయాలన్నారు. బెల్లం లేయర్లుగా వేసుకుంటే 25 నుంచి 30 రోజులకు పొటాష్ తయారవుతుందన్నారు. ఆ ద్రావణాన్ని అన్ని రకాల పంటలకు పొటాష్ నివారణకు ఉపయోగించవచ్చన్నారు. ఒక ఎకరాకు అర లీటరు వరకు వాడుకోవచ్చన్నారు. అంతేగాకుండా ఇది గ్రోత్ ప్రమోటర్‌గా చక్కగా ఉపయోగపడుతుందని వివరించారు. వరి, చామ, వేరుశనగ, ఆకు కూరలు, కూరగాయల పంటలలో దీని ప్రభావంతో మంచి దిగుడబడులు సాధించవచ్చన్నారు. రైతులంతా తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చన్నారు. ఈ ద్రావణాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వికాస్‌రెడ్డి, ప్రసంగి, సౌమ్య, ఆదిత్యారామ్, ప్రవన్‌రెడ్డి, నరసింహులు, కొట్టం, బ్రహ్మయ్య, నిఖిల్, యూనిట్ ఇన్‌చార్జి పిట్టు వెంకటేశ్వరరెడ్డి, ఎస్కే రెహమాన్‌బాషా, మనోహర్‌రెడ్డి, కాసింబి, వెంకటరమణ, సుజాత, మహిళా సంఘాల సభ్యులు, ప్రకృతి వ్యవసాయ సభ్యులు పాల్గొన్నారు.

16 నుంచి తిరుప్పావై ప్రవచనాలు



తిరుప్పావై ప్రవచనాలకు సంబంధించిన ఫ్లెక్సీలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: ధనుర్మాసం సందర్భంగా జిల్లావ్యాప్తంగా వైష్ణవాలయాల్లో ఈ నెల 16వ తేదీ నుంచి తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించనున్నారు. అందుకోసం ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒంగోలు నగరంలోని సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు వారి ప్రవచకులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు, స్థానిక పీవీఆర్ గర్ల్స్ హైస్కూల్ దగ్గర గడియారంవారివీధిలోని అనంత కోదండరామస్వామి మందిరంలో టీటీడీ నాలాయిర దివ్య ప్రబంధం అధ్యాపకులు శ్రీమాన్ భాగవతుల శ్రీనివాస చక్రవర్తి (తిరుమగనాచార్యులు), లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో డాక్టర్ రమేష్ కృష్ణ ప్రవచిస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా ఒంగోలు గాంధీ రోడ్డు గీతా మందిరంలో టీటీడీ, ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు వారి సౌజన్యంతో ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు తిరుప్పావై ప్రవచనాలు ఏర్పాటు చేసినట్లు మందిరం భక్త బృందం నిర్వాహకురాలు సురేఖ వెల్లడించారు. సోమవారం నుంచి ధనుర్మాసం ప్రారంభమవుతున్న దృష్ట్యా గోదాదేవి రచించిన 30 పాశురాలపై ఈ నెల 16వ తేదీ నుంచి జనవరి 13వ తేదీ భోగి పండుగ వరకు నెలరోజుల పాటు తిరుప్పావై ప్రవచనాలు జరుగుతాయని వైష్ణవాలయాల నిర్వాహకులు వెల్లడించారు. ప్రతిరోజూ ఉదయం ఆరు గంటల నుంచి తిరుప్పావై, భగవద్గీత పారాయణ, తొమ్మిది గంటలకు నుంచి తిరుప్పావైపై పొన్నూరు ఉపన్యాసం ఉంటుందని తెలిపారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి, గోదా శ్రీరంగనాథుల అనుగ్రహానికి పాత్రులు కావాలని ఒంగోలు గాంధీ రోడ్డు గీతా మందిరం నిర్వాహకులు కోరారు. తిరుప్పావై ప్రవచనానికి సంబంధించిన ఫ్లెక్సీలను శనివారం గీతా మందిరం నిర్వాహకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కృష్ణ, రాజేష్, మువ్వల సుబ్బారావు, విజయలక్ష్మి, సుబ్రహ్మణ్యం, రాజేశ్వరి, అరుణ, అనిత, రాధా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధికే కేంద్రీయ విద్యాలయాలు



మాట్లాడుతున్న ఎంపీ మాగుంట

ఒంగోలు సిటీ: విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కేంద్రీయ విద్యాలయాలు ఎంతగానో తోడ్పడుతున్నాయని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. శనివారం ఒంగోలులోని కేంద్రీయ విద్యాలయంలో 62వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ మనీష్‌కుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీ మాగుంట పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఒంగోలు కేంద్రీయ విద్యాలయం అంటే తనకు ప్రత్యేక అభిమానమన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ముందుంటానన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ వెంకటసురేష్, పూర్వ ప్రిన్సిపాల్ సూర్యప్రకాశరావు, నాయకులు అయినాబత్తిన ఘనశ్యాం, తాతా ప్రసాద్, అధ్యాపక సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.





నృత్య ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థినులు